క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి జూడో ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపిక విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

శిరివెళ్ల: రాష్ట్ర స్థాయి జూడో ఆటల పోటీలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులకు హెచ్‌ఎం గోవిందరాజులు, టీచర్లు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీలలో విద్యార్థులు సత్తా చాటారన్నారు. 10వ తరగతి విద్యార్థి రీహన్, రేష్మ (8), హెస్సీబా (9), రసూల్‌బీ (7) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. శిక్షణ ఇచ్చిన పీడీ షేక్షావలిని టీచర్లు అభినందించారు..

రెండో రోజు కొనసాగిన వీఆర్‌ఏల నిరసన



ఇన్‌చార్జ్ తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

రుద్రవరం: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం వీఆర్‌ఏల నిరసన రెండో రోజు కొనసాగింది. కూటమి ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని లేదంటే నిరసన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారు వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు, అర్హులైన వారికి పదోన్నతులు తదితర డియాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దారు చంద్రశేఖర్‌కు అందజేశారు. నిరసనలో మండలంలోని అన్ని గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పెయ్యదూడలు పుట్టేలా సూదులు

దొర్నిపాడు: పాడిపెంపకం ప్రోత్సహించి పాల ఉత్పత్తిని పెంచేందుకు ఇక పెయ్యదూడలు మాత్రమే పుట్టేలా సూదులు అందుబాటులో ఉన్నాయని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ చిన్నబాబు సూచించారు. గాలికుంటువ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా ఆయన పాడిరైతులకు సూచించారు. ప్రతి పశువుకి గాలికుంటు టీకాలు తప్పని సరిగా వేయించాలన్నారు. ఎద సూది రూ.150 మాత్రమే ఉంటుందన్నారు. సూది ద్వారా పుట్టిన పెయ్య దూడలు చూడి అనంతరం రోజుకూ 15–18 లీటర్ల పాలు ఇస్తాయన్నారు. దీంతో రైతుకు ఆర్థిక నష్టం లేకుండా ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

గోస్పాడు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ షేక్‌ఫయాజ్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 1,370 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. వారందరినీ ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటీర్లు చదువు నేర్పించాలన్నారు. ప్రతి మహిళకు తప్పని సరిగా చదువు అవసరమని, పొదుపు సంఘాల్లో ఉన్న ప్రతి నిరక్షరాస్య సభ్యురాళ్లను తప్పక చదవటం, రాయటం నేర్పించాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు.అనంతరం పుస్తకాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీఓ గంగన్న, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో ఇటీవల డీఎస్సీలో ప్రతిభ చూపి నూతన ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని యాదవ సంఘం ఆధ్వర్యంలో బత్తుల రాజు గుర్రప్ప యాదవ్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు పవన్‌కుమార్, రాజశేఖర్, వినోద్‌కుమార్, శ్రీనివాసులు, కానిస్టేబుల్ లింగన్న సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అంకిత భావంతో తమ వృత్తిని కొనసాగించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

నంద్యాల(అర్బన్): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని జిల్లా జేఏసీ నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, కృపవరం తెలిపారు. స్థానిక ఎస్‌ఈ కార్యాలయ సమీపంలో విద్యుత్ జేఏసీ నాయకులు శుక్రవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్‌లను జేఎల్‌ఎంలుగా పరిగణించి వేతనాలు, ప్రయోజనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని, ఇంజినీరింగ్, డిగ్రీ కలిగిన సబ్ ఇంజినీర్లకు ఏఈలుగా పదోన్నతిలో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు రామయ్య, రవికుమార్, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

చాగలమర్రి: మండలంలోని చాగలమర్రి, పెద్ద బోధనం సబ్ స్టేషన్ల పరిధిలోని మల్లెవేముల కలుగోట్లపల్లె, గోట్లూరు, నగళ్లపాడు, తిప్పనపల్లె, పెద్ద బోధనం, చిన్న బోధనం, రాంపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రమణయ్య తెలిపారు.

పైసలిస్తేనే పోస్టు!

- రూ. 1.50 లక్షలివ్వకపోతే తొలగిస్తామని హెచ్చరిక
- ఆందోళనలో 136 మంది సీఆర్పీలు
- అధికారపార్టీ నాయకులతో కలిసి సీఎంఎం శోభారాణి బెదిరింపు
- మెప్మా ఎండీకి ఫిర్యాదు చేసిన సీఆర్పీలు
- విచారణ చేపట్టిన అధికారులు



మెప్మా కార్యాలయంలో విచారణ అధికారుల బృందం ఎదుట హాజరైన సీఆర్పీలు

బొమ్మలసత్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ విభాగాల్లో పనిచేసే చిరు ఉద్యోగులకు భద్రత లేకుండాపోయింది. కాసులిస్తేనే కొనసాగుతారు లేదంటే మీ స్థానంలో కొత్త వారు వస్తారని బెదిరింపులకు పాల్పడుతున్నారు. చివరకు గౌరవ వేతనంపై పొదుపు సంఘాలకు సేవలందిస్తున్న సీఆర్పీలపై టీడీపీ నాయకుల కన్ను పడింది. నంద్యాల మెప్మా కార్యాలయంలో సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం)గా విధులు నిర్వహించే శోభారాణి ఆధ్వర్యంలోనే ఈ తంతు నడుస్తోందని సీఆర్పీలు ఆరోపిస్తున్నారు. నంద్యాల మెప్మా కార్యాలయంలో చాలా ఏళ్ల నుంచి 136 మంది సీఆర్పీలుగా పనిచేస్తున్నారు. వీరు పట్టణంలోని పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులు, పుస్తకాలు చూస్తుంటారు. నెలకు రూ. 8 వేల వేతనంతో పనిచేసే వీరిపై వేటు వేయించి కొత్తవారికి ఆ పోస్టులు అమ్ముకోవాలని అధికారపార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా సీఎంఎం శోభారాణిని ప్రతి రోజు మంత్రి కార్యాలయానికి పిలుపించుకొని చర్చిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతమున్న వారు కొనసాగాలంటే రూ. 1.50 లక్షలివ్వాలని లేదంటే కొత్తవారిని నియమిస్తామని సీఎంఎం బెదిరిస్తున్నారని సీఆర్పీలు చెబుతున్నారు. డబ్బు ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో తొలగించేందుకు పొదుపు సంఘాలతో కలిసి తీర్మానాలు చేయిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

దొంగ తీర్మానాలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పేర్లతో వేధింపులు

మెప్మా ఉద్యోగిని శోభారాణి చొరవతో 136 మంది సీఆర్పీల తొలగింపునకు మంత్రి కార్యాలయంలో ఉండే అనుచరులు దొంగ తీర్మానాలను, సిర్టిఫికెట్ వెరిఫికేషన్లు చేయటం ప్రారంభించారు. వార్డు టీడీపీ నాయకులు సమాఖ్య గ్రూప్ సభ్యుల వద్దకు వెళ్లి ఒక్కొక్కరిగా సంతకాలు సేకరించి నకిలీ తీర్మానాలు తయారు చేస్తున్నారని సీఆర్పీలు ఆరోపిస్తున్నారు. ఇదే కాకుండా సీఆర్పీల సర్టిఫికెట్‌లను శోభారాణి పరిశీలిస్తూ ఇబ్బందులకు గురిచేశారనే విమర్శలు ఉన్నాయి. ఇద్దరు సీఆర్పీల భర్తలు ప్రభుత్వ ఉద్యోగులు కానప్పటికీ ఉద్యోగం ఉందనే నెపం చూపించి వారిని తొలిగిస్తున్నామని భయాందోళనకు తెరలేపారు. ఇలా ప్రతి రోజు సీఎంఎం శోభారాణి వేధింపులు తట్టుకోలేక ఇటీవల సీఆర్పీలు మెప్మా ఎండీకి ఫిర్యాదు చేశారు.



మెప్మా అధికారిణిని నిలదీస్తున్న సీఆర్పీలు

మెప్మా కార్యాలయంలో విచారణ

సీఆర్పీల ఫిర్యాదు నేపథ్యంలో మెప్మా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణ అధికారులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా కార్యాలయానికి వచ్చారు. పట్టణంలోని 136 మంది సీఆర్పీలతో పాటు సీఎంఎం శోభారాణి విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శోభారాణిపై సీఆర్పీలు తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆందోళనకు దిగారు. మంత్రి అనుచరులతో చేతులు కలిపి తమ స్థానంలో కొత్తవారిని నియమించుకునేందుకు పావులు కదుపుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

తొలగించాలని చూస్తున్నారు



సీఆర్పీలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ నేతలకు మెప్మా అధికారులే సహాయం చేస్తున్నారు. మెప్మా అధికారులు తీర్మానం బుక్కులు రూ. 1000 కి టీడీపీ నేతలకి అమ్మి సమాఖ్య సభ్యులతో దొంగ సంతకాలు చేయించేలా చూస్తున్నారు. సీఎంఎం శోభారాణి మెప్మా కార్యాలయంలో కంటే మంత్రి కార్యాలయంలోనే అధిక సమయం కేటాయిస్తుంది. అందుకే సీఎంఎం తీరుపై మెప్మా ఎండీకి ఫిర్యాదు చేశాం. –సుజాత, సీఆర్పీ, నంద్యాల

గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నాం



నంద్యాల పట్టణంలో గత 20 ఏళ్లుగా సీఆర్పీగా పనిచేస్తున్నాను. గతంలో ఎవ్వరూ కూడా సీఆర్పీలపై ఈవిధమైన కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమాన్ని పొదుపు మహిళలకు అందిస్తూ వస్తున్నాం. ప్రస్తుత మంత్రి కార్యాలయానికి శోభారాణి వెలుతూ మమ్మల్ని తొలగించేందుకు సన్నాహాలు చేస్తుంది. పాత వారు సీఆర్పీగా కొనసాగాలంటే రూ. 1.50 లక్షలు, కొత్తగా నియామకం చేయాలంటే రూ.2 లక్షలు నిర్ణయించి మా కడుపు కొట్టేందుకు కూటమి నేతలు చూస్తున్నారు. –ప్రసన్నకుమారి, సీఆర్పీ, నంద్యాల

ఉపాధి కల్పనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): వృత్తి విద్య కోర్సు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచి ఉపాధి కల్పనకు కృషి చేయనున్నట్లు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రేమాంతకుమార్, డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిప్యూటీ డీఈఓ కార్యాలయం వద్ద వొకేషనల్ ఎడ్యుకేషనల్ వ్యవస్థ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి విద్యలో తీసుకొని రావాల్సిన మార్పుల గురించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో జీసీడీఓ నాగసువర్చల, ఏఎంఓ మాధవి, సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఏపీటీఎఫ్ ఆర్థిక సాయం

నంద్యాల(న్యూటౌన్): గోస్పాడు మండలం చింతకుంట్ల గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న రవికుమార్ అనే ఉపాధ్యాయుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నంద్యాల జిల్లా ఏపీటీఎఫ్ 257 ఉపాధ్యాయ సంఘం శుక్రవారం రూ.37,716 ఆర్థిక సాయం అందజేసింది. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య, జిల్లా సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని నియమించాలి



యూటీఎఫ్ రణభేరి జాతాలో మాట్లాడుతున్న ప్రసాద్

నంద్యాల(న్యూటౌన్): 12వ వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)ని నియమించి పెండింగ్ బకాయిలు చెల్లించాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించాలని రణభేరి జాతాలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి జాతా నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర సహా అధ్యక్షుడు సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజ, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందం సాల్ట్ పథకం వల్ల ప్రభుత్వ పాఠశాల విద్యారంగం బలహీన పడుతుందన్నారు. ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.1,860 కోట్లు అప్పు అందులో భాగమనేనని ఆరోపించారు. ఉపాధ్యాయులకు పాఠశాల పని దినాల్లో శిక్షణ ఇస్తున్నారని, రకరకాల బోధనేతర కార్యక్రమాలను రూపొందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్, జిల్లా ఆఫీసు బేరర్లు, రామ్మోహన్, సోమయ్య, మల్లికార్జునప్ప, గోపాల్, సుజాత, దస్తగిరి, రమణ, జాన్సన్, రామదాసు, ప్రేమ్‌కాంత్, శిఖామణి, చంద్రశేఖర్, శేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష

- పాముకాటుపై అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌ఓ



పాముకాటుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: వర్షాకాలం పాముల సీజన్ అని, పొలాల్లో పని చేసే రైతులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 43 మంది పాము కాటుకు గురి కాగా ముగ్గురు మృతి చెందినట్లు తెలిపారు. పాముకాటుకు గురైన వారికి విషప్రభావం కలిగే అవకాశం ఉందన్నారు. ఇళ్లపరిసరాలు, తోటల్లో చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గడ్డి ఉన్న ప్రదేశాలను ఎప్పటికప్పుడు కత్తరించాలని తెలిపారు. పొలాల్లో రైతులు కూడా గట్ల వెంట గడ్డి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళ పొలాలకు వెళ్లే రైతులు టార్చ్ లైట్లు వాడాలని, కర్రను వెంట తీసుకెళ్లాలని సూచించారు. ముందుజాగ్రత్త చర్యలే పాము కాటు నుంచి రక్షిస్తాయన్నారు. ఎవరైనా ప్రమాదవశాత్తు పాము కాటుకు గురైతే అలాంటి వారు నాటు వైద్యం వాడరాదని, సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు, డాక్టర్లు ఆశరఫ్ అలీ, శ్రీజా, ప్రసన్నలక్ష్మి, భరత్‌కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి రవీంద్రనాయక్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఐదుగురు అరెస్టు

బొమ్మలసత్రం: మైనర్లను పనికి తరలిస్తున్న ఐదుగురిని నంద్యాల రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఆర్‌పీఎఫ్ సీఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు.. హౌరా నుంచి యశ్వంతపూర్ వెళ్లే రైలులో చిన్న పిల్లలను అక్రమంగా రవాణా చేస్తున్నారు. రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వేస్టేషన్‌కి రైలు చేరుకోగానే దాడులు నిర్వహించి తొమ్మిది మంది బాలురును, ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారులను శిశు సంరక్షణ కేంద్రానికి తరలించి నిందితులను విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. చిన్నారులు ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. దాడుల్లో జిల్లా శిశుసంరక్షణ అధికారిణి స్వప్న ప్రియదర్శిని, రైల్వే ఎస్‌ఐ కుమారి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఆహారం

శిరివెళ్ల: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఆహారం లభిస్తుందని ఆచార్య రంగా స్టేట్ బోర్డు అడ్వైజర్ బోర్డు మెంబర్ బాల మద్దిలేటి అన్నారు. శుక్రవారం యర్రగుంట్లలో నాఫెడ్, సీమాసెస్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తుదారుల కంపెనీ ఏర్పాటు జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశవాళీ విత్తనాలు వాడాలని, సేంద్రియ వ్యవసాయం ఉత్తమమయిందన్నారు. అధిక దిగుబడుల కోసం విచ్చల విడిగా రసాయనిక ఎరువుల వాడరాదన్నారు. రైతు ఉత్పత్తి సొసైటీ స్థానిక రిసోర్స్ పర్సన్ ఉశేని, ఎఫ్‌ఆర్‌ఓ చైర్మన్ గురు వర్ధన్ రెడ్డి, ప్రెసిడెంట్ రఘునాథరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి వాస్తవమే



దాడిలో గాయపడిన బాధిత విద్యార్థి, తల్లిని విచారిస్తున్న డిప్యూటీ డీఈఓ శంకర ప్రసాద్

సాక్షి ఎఫెక్ట్

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 15వ తేదీన 10వ తరగతి విద్యార్థులపై కిశోరి అనే నాన్ టీచింగ్ ఉద్యోగిని దాడి చేశారు. సాక్షి దినపత్రిక వెలుగులోకి తెచ్చిన ఈ విషయంపై కడప ఆర్‌జేడీ శామ్యూల్ ఆదేశాల మేరకు నంద్యాల, ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్, ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు రవికాంత్ బాబు, కాశన్న శుక్రవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. బాధిత విద్యార్థి అక్బర్ అలీ అతని తల్లితో మాట్లాడి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మిగతా విద్యార్థులను కూడా వారు విచారించారు. అనంతరం సదరు అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు ఏ తప్పు చేయక పోయిన దాడి చేసినట్లు రుజువైందన్నారు. దాడి జరిగిన విషయం వాస్తవమేనని విచారణలో తేలిందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకాం ఉపాధ్యాయులు కట్టెలతో విద్యార్థులపై దాడి చేయకుడదన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా యాజమాన్యంపై గట్టి చర్యలు చేపట్టే విధంగా కడప ఆర్‌జేడీకి, నంద్యా జిల్లా కలెక్టర్‌కు, డీఈఓకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

కాళికాంబాదేవికి పూజలు

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

జీరో స్థాయికి మాతా శిశు మరణాలు

- వైద్య, స్త్రీ శిశు సంక్షేమ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో మాతా, శిశు మరణాలను పూర్తిగా నివారించాలని వైద్య, స్త్రీ శిశు సంక్షేమ అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మొదటి త్రైమాసికంలో జరిగిన మాతా–శిశు మరణాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క మాతా–శిశు మరణం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణి సురక్షిత ప్రసవానికి హామీ ఇవ్వడం, శిశువుల ఆరోగ్య రక్షణ కల్పించడం ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖలు అత్యంత ప్రాధాన్యతగా భావించి వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ మాసం వరకు ఒక మాతృ మరణం, మూడు శిశు మరణాలు జరగడం అత్యంత విచారకరమన్నారు. కేసు మానిటరింగ్ ప్రాపర్‌గా లేకపోవడం, కుటుంబ సభ్యులకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పించకపోవడం వలనే ఈ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో చూడాలన్నారు. ప్రతి ఉద్యోగి తమ విధులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. బాల్య వివాహాలు అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చెంచు గూడెంలలో ఆరోగ్య కార్యకలాపాలు ముమ్మరం చేయాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు రెగ్యులర్‌గా ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేయడంతో పాటు పోషకాహార ప్యాకేజీలు తప్పనిసరిగా అందించాలన్నారు. జిల్లాలో మాతా–శిశు మరణాల నియంత్రణకు అధికారులందరూ పూర్తి స్థాయి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, స్త్రీ శిశు సంక్షేమ అధికారి లీలావతి, డీసీహెచ్‌ఎస్ ఒ.లలిత, డీఐఓ సుదర్శన్ రావు, సంబంధిత మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయ భవనం పరిశీలన

నంద్యాల(అర్బన్): పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఉన్న పట్టు పరిశ్రమ కార్యాలయ భవనాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం పరిశీలించారు. జిల్లా నూతనంగా ఏర్పడిన నేపథ్యంలో కొంతమంది అధికారులకు ప్రత్యేక కార్యాలయ భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన కలెక్టర్, మౌలిక వసతుల ఏర్పాటు నిమిత్తం సర్దుబాటు అవకాశాలు పరిశీలించారు. పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయ భవనంలో మొత్తం 12 గదులు ఉండటంతో, ఇతర శాఖలకు కేటాయించే అంశాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి నగేష్ భవన వివరాలను కలెక్టర్‌కు వివరించారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



డీఎస్పీ, సీఐలతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆళ్లగడ్డ: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని ఆళ్లగడ్డ రూరల్, శిరివెళ్ల పోలీస్ స్టేషన్లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకుని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాలను అడ్డుకట్ట వేసి, శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. మహిళలు, చిన్నపిల్లల భద్రతకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి శాంతి భద్రతలను అదుపులో ఉంచాలన్నారు. నాటు సారా, అక్రమ మద్యం, పేకాట, క్రికెట్ బెట్టింగులకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈయన వెంట డీఎస్పీ ప్రమోద్, సీఐ మురళీధర్‌రెడ్డి ఉన్నారు.



మకా సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న ముస్లిం మతపెద్దలు

బార్ ఏర్పాటు సరికాదు

నంద్యాల(అర్బన్): స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్ (మాకా సర్కిల్) వద్ద బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పట్టణంలోని నాలుగు మసీదులకు చెందిన మతపెద్దలు, ప్రజలు ఆందోళన చేపట్టారు. బార్ వద్దు శాంతి కావాలంటూ శుక్రవారం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సమస్యను పరిష్కరించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ షమీవుల్లాఖాన్, ఉపాధ్యక్షుడిగా షేక్‌నూర్ బాషా, కార్యదర్శిగా హుసేన్‌బీ, అబులైజ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు షమీవుల్లాఖాన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడికి కేటాయించిన ఈ ప్రాంతంలో బార్ ఏర్పాటు దుర్మార్గమైన చర్య అన్నారు. దీనిని ఎవరూ హర్షించరని, అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని బార్ ఏర్పాటు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చింపింగ్ బాసిత్, సర్దార్, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ మొత్తం వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ మొత్తాన్ని వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలని మున్సిపల్ కమిషనర్ శేషన్నకు మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దస్తగిరి, నాగశేషులు కోరారు. శుక్రవారం వారు కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. పురపాలక ప్రాథమిక పాఠశాల, బైర్మల్ స్ట్రీట్ స్కూల్‌ను వైఎస్సార్‌నగర్ సమీపంలో ఉన్న బుడగజంగాల కాలనీకి మార్చినందున సొంత భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. అలాగే పురపాలక ప్రాథమిక పాఠశాల హైస్కూల్ స్ట్రీట్‌ను పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని జగజ్జీవన్ నగర్‌కు మార్పు చేయాలని కోరారు.

సంక్షిప్తం

ఉల్లి పంట పరిశీలన

చాగలమర్రి: 'ఉల్లి రైతుకు కన్నీళ్లు' అనే శీర్షికన ఈనెల 17 న సాక్షి ప్రచురించిన కథనంపై ఆళ్లగడ్డ నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారి దస్తగిరి స్పందించారు. శుక్రవారం ఆయన చిన్నవంగలి గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న శ్రీరాం రెడ్డి అనే రైతుకు చెందిన ఉల్లి పంటను పరిశీలించారు. ఆళ్లగడ్డ నియోజక వర్గ పరిధిలో 450 హెక్టార్లలో రైతులు ఉల్లి పంట సాగు చేశారని వా టిలో 40 నుంచి50 హెక్టార్లలో ఉల్లి పంట అక్టోబర్ నెల మొదటి వారంలో కోతకు వస్తుందన్నారు. అయితే, వర్షం పడే సమయంలో పంట కోత చేయరాదన్నారు.

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఇండోర్‌స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 బాలురు, బాలికల బాక్సింగ్ పోటీలు హోరాహోరీగా సాగాయి. 170 మంది క్రీడాకారులు పాల్గొన్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు విశ్వనాథ్, ఆశాజ్యోతి పర్యవేక్షించగా గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన వారు అక్టోబర్ 15 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న దస్తావేజు లేఖరుల నిరసన

నంద్యాల(అర్బన్): దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలని నంద్యాల జిల్లా స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఫరూక్, రమేష్ డిమాండ్ చేశారు. పెన్‌డౌన్లో భాగంగా రెండోరోజు శుక్రవారం దస్తావేజు లేఖర్లు స్థానిక తహసీల్దార్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లకు ఓటీపీ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, స్టాంప్ వెండర్లు నాగలక్ష్మీదేవి, ఆదినారాయణరెడ్డి, బాషా పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాడు గడ్డలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మల్లికార్జున స్వామి దేవస్థానం, చిత్తలూరి వీధిలోని శ్రీకృష్ణ భజన మందిరంలలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. గ్రూప్ ఆఫ్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరిచంద్ర రెడ్డి, ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపులో రూ.2.05,039 రాగా, మల్లికార్జున స్వామి దేవస్థానం హుండీలో రూ.75,332, చిత్తలూరు వీధిలోని శ్రీకృష్ణ భజన మందిరం హుండీ నుంచి రూ.11,223 ఆదాయం లభించిందన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

గోస్పాడు: మహిళలు ఆరోగ్యం జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావునాయక్ తెలిపారు. స్వస్థ్ నారీ–సశక్త్ సంవార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన గోస్పాడులో కంటి వైద్య నిపుణులు డాక్టర్ సింథియా, గైనకాలజీ నిపుణులు డాక్టర్ అనూష ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్థర్‌సైమన్, సర్పంచ్ ప్రమీలమ్మ, వైద్యాధికారి షబ్బీర్ అలీ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్లేట్లు అందజేత

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ ఎంపీపీ, కడమలకాల్వకు స్పెషల్ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం స్టీల్‌ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు వివేకానంద రెడ్డి, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ క్లబ్ సభ్యుడు సురేంద్ర సహకారంతో రూ.10వేలు విలువ గల స్టీల్‌ప్లేట్లను పాఠశాలకు, క్లబ్‌సభ్యుల సహకారంతో రూ.2వేలు విలువ చేసే బెల్, గోడ గడియారాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించినట్లు వెల్లడించారు. సమాజసేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ప్రసాదరెడ్డి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

సయ్యద్ గులాబ్‌షా వలి ఉరుసు ప్రారంభం



విద్యుత్‌దీపాలంకరణలో గులాబ్‌షావలి దర్గా

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీహజరత్ సయ్యద్ గులాబ్‌షా వలి రిఫాయి అహమ్మదీ దర్గా ఉత్సవాలు (ఉరుసు) ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఉరుసులో తొలి రోజు శుక్రవారం రాత్రి గంధోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఊరేగింపు నిర్వహించి దర్గాకు గంధం సమర్పించారు. రెండో రోజు శనివారం ఉరుసు, ఆదివారం జియారత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. మూడో రోజు రాత్రి ఖవ్వాలి ఉంటుందన్నారు.తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.